# వనిత

మల్లి



"అజంతా శిల్పాన్ని అమాంతం ఎత్తుకొచ్చి ఇంట్లో ప్రతిష్ఠించుకున్నావు. అదృష్టవంతుడివి. మువ్మూర్తులా అజంతా శిల్పమే.." అన్నది. అరవింద; 'శిల్పం' అనే మాట దగ్గర గమ్మత్తుగా నొక్కుతూ...

అరవిందు మాటల్లో అర్థం మురళీ కృష్ణకి తెలియకపోలేదు. అతను, అతితేలిగ్గానూ,అందంగానూ ఒక్కసారి నవ్వేసి.''శిల్పానికి జీవం పోసి, శిల్పికి ఆశ్చర్యం కలిగిస్తాను..... అప్పుడో?'' అన్నాడు.

''అదన్నమాట నీవుద్దేశ్యం..... కంగ్రాట్యులేషన్స్'' అంది అరవింద; ..తన చేతిలో వున్న చిన్న పెట్టెమూత తెరుస్తూ......

అందులో ఏమివుందా ము.ఃళీ కృష్ణకితెలుసు:

వనితకి ఆమె తెచ్చిన కానుక.

నల్లపూసలతో తయారు చేసిన బంగారునెక్లేసది. అరవింద సెలక్షను అందంగా వుంటుందని అతనికి తెలుసు.

''ఇది నువ్వే స్వయంగా ఆమె మెడకి అలంకరించాలి— నేను వెడుతున్నాను...గుడ్ నైట్''అంది అరవింద ఆపెట్టెని అతని ముందుకి నెడుతూ.

''థాంక్స్'' అన్నాడు, లాంఛన ప్రాయంగా... అతనికి అరవింద అలా వెళ్ళి పోవడం యిష్టం లేదు..... ఆగదనీ తెలుసు..

డిన్నర్ కని వచ్చిన అతిథులు ఇంకా పూర్తిగా వెళ్ళిపోలేదు. కొందరు రేడియో దగ్గర చేరారు. కొందరు వనితను ప్రశ్నలతో విసిగిస్తున్నారు. మరి కొందరు కారమ్సు ఆడుతున్నారు.

గోడ గడియారం అప్పుడే పదకొండు కొట్టింది.

అతను అలా చూస్తు వుండగానే అరవింద గేటుతీసుకుని, బయట చీకటిలో కలసిపోయింది.

''పాపం, అరవింద'' అనుకున్నాడు.

''అరవింద సంస్కారం వున్న అమ్మాయి... కానీ, వనిత, తనకి తగదని ఆమె అభిప్రాయం.

అందుకే ''శిల్పం'' దగ్గర అలానొక్కి పలికింది.




మురళీ కృష్ణ నవ్వుకున్నాడు.

శిల్పం అయితేనేంగాక, సౌందర్యం ఆ శిల్పం యొక్క జన్మ హక్కు.

ఆ సౌందర్యపు పరిమళాల మమతల్లో, తన జీవితం అర్పితం అయిపోయినా ఫరవాలేదు...... అందులో ఆర్ద్రత వుంది.. ఆనందం వుంది.

అతిథులంతా ఒక్కొక్కరే వెళ్ళి పోతున్నారు. నలుగురు మాత్ర మిగిలారు.



వాళ్ళూ చల్లగాలికి టెర్రేసుమీద పడుకున్నారు.

లోపల వనిత డ్రెస్సు మార్చుకుని పడుకుని వుంటుంది... ప్రక్కనే ఆమె తల్లికూడా పడుకుంది.

వాళ్ల గదిలోకి వెళ్లడం అతనికి సభ్యతగా తోచలేదు. ఇప్పుడు తను పిలిచినా, వనిత తనతో మాట్లాడదు...

ఆమె గులాబీ చెక్కిళ్లల్లో కెంపులు తను ఎప్పుడు చూడాలి''.

మురళీ కృష్ణ కిటికీ తలుపు తెరిచి, ప్రక్కగా ఈజీచైర్ లాక్కుని కూర్చుని, చందమామకేసి చూడ సాగాడు.... అయిదు నిముషాల్లో అతను హాయిగా నిద్ర పోయాడు.

* * *

రాత్రి పన్నెండు గంటలవేళ మెలకువ వచ్చి లేచి ప్రక్క మీద కూర్చుంది. సీతా మహాలక్ష్మి...

ఆమె గుండె భయంతో కంపిస్తోంది..

చుట్టూ కలయ జూసింది.

ఎవరూ లేరు.....

ఈ ఏకాంతం ఆమెకి ప్రశాంతంగా వుంది.

ఈవూరు తను నిన్న వచ్చింది. అప్పటినుంచే ఒకటే భయం.

ఎవరెవరో వస్తారు.. ఎప్పటి నుంచో పరిచయం వున్నట్లు పలకరించి నిమిషాల కొద్దీ మాట్లాడతారు. తనకి ఒక్కటే అర్థం కాదు.

ఒకటే రణ ణధ్వని గుళ్ళో ఇలాగే గంటల మ్రోగేవి, తిమ్మన పాలెంలో..

కొందరు పురుషులు చనువుగా తన చెయ్యి పట్టుకు వూగించి మరీ పోతున్నారు....

కొందరూ మరీ వెగటుగా, ''ఏం కళ్ళు—ఏం కళ్ళు'' అంటారు తన ముఖానే.......

సీతా మహాలక్ష్మికి తలనొప్పి వచ్చింది.

తను ఏం చేయాలో తోచక ఇలా అయోమయావస్థలో పడివుంటే, ఆయనదగ్గరగావచ్చి ''చూడూ! నీకేం భయం లేదు.. వీళ్లందరూకూడా నీలాంటి మనుష్యులే.. వాళ్ళు నమస్కారం చేస్తే నువ్వూ చెయ్యి... పలకరిస్తే చిరునవ్వు నవ్వు'' అన్నారు.

ఆయన అంత దగ్గరగా వస్తూంటే మరీ భయం వేసిందిగానీ, ఆయన మాటలు మాత్రం మహా ప్రవాహంలో పడి ఈదుతున్న తనకి తెప్పల్లాగా తోచాయి. అలాగే చేస్తూ వచ్చింది. సాయంత్రం నుంచి, ఆ గుంపు అందరూ వెళ్ల దాకా.....

తనకి అట్లా ప్రతి వాళ్లకీ నమస్కారాలు చేస్తూ కూర్చోడం మహా చికాకు.

అయినా ఈ ఆడవాళ్ళూ మొగవాళ్ళూ, ఇలా ఒకర్నొకరు రాసుకుంటూ తిరగడం అసలు బాగుండలేదు.

కానీ ఆయన చెప్పినట్లు చెయ్యటం తన ధర్మం. లేకపోతే ఆయనకి కోపం రావచ్చును. వెనకోసారి అమ్మ ఇలానే, ఏదో నాన్న చెప్పినపని చెయ్యకపోతే చెంపమీద కొట్టాడు.



అమ్మ ఏడుస్తూ ''ఆడదానిరాత ఇంతే'' అంది తనూ ఆడదే. ఇప్పుడు తను ఒకరికి ఇల్లాలు. అందులో బస్తీలో వాళ్లకికోపం ఎక్కువట. ఇలా అని అమ్మమ్మ అంటూ వుండేది.

"హమ్మయ్య అందరూ పోయారు. హాయిగా వుంది. వెన్నెలకూడా బావుంది" అనుకుని, టేబిల్ మీద గ్లాసులున్న సంగతి మర్చిపోయి కూజాలోనే మంచి నీళ్ళన్నీ తాగేసింది సీతామహాలక్ష్మి.

తన ప్రక్కనే అమ్మ నిద్రిస్తోంది.

ఆయనకూడా నిద్రపోతూ వుంటారు. ఇంత వరకూ కళ్ళెత్తి సరిగ్గా చూడనయినా లేదు. పెళ్ళిలో పాదాలు చూసింది. చామంతి పూల రంగులో మెరుస్తున్నాయి ఆ పాదాలు.

ఆయనఅందాన్ని అందరూఒకటే పొగడటం.. పూర్వం తను చాలా పుణ్యం చేసి వుండాలి అమ్మ చెప్పింది అలా అని. లేకపోతే ఇంత పెద్ద భవనమూ నౌకర్లూ.

తనకి ఆయన తెచ్చిన దుద్దులే రెండు వేలు ఖరీదు చేస్తాయట. ఎంత అందంగా మెరుస్తున్నాయవి.

సీతామహాలక్ష్మి తియ్యగా ఆలోచిస్తూ నిద్ర పోయింది. అందమైన కలకూడా వచ్చింది ఆమెకు.

రేపు పొద్దున్న అమ్మ వెళ్ళిపోతుంది. మళ్ళి అమ్మని తనెప్పుడు చూస్తుందో. తెల్లవారింది.

సీతామహాలక్ష్మి లేచి అమ్మకి మల్లె మాంగల్యం కళ్ళకి అద్దుకుని చరాచరా వంట ఇంట్లోకి వెళ్ళింది.

వంటావిడ ఇంకా నిద్రపోతూనే వుంది.

ఆమెని లేపి "పెందరాడే లేవాలి" అంది.

ఆవిడ విసుక్కుంటూనే లేచి ముఖం కడిగి తనకి కాఫీ చేసి యిచ్చింది.

తనకి పనేమీలేక, తోచడం లేదు. రేపు ఈమెని మాన్పించమని చెప్పాలి. తను చెబితే మాన్పించుతారేమిటి తనవంక ఉగ్రంగాచూస్తే!! అమ్మో!

బావకి అంత డబ్బు వుందన్న మాటేగానీ, అక్కయ్యని ఎన్నిబాధలు పెడతాడు.

మామయ్య, అత్తయ్యానీ అంతే.....

అమ్మా, నాన్నల సంగతి తను రోజూ చూస్తూ వుండేది.

బామ్మని, తాతయ్య చితకబాదేవాడట.

ప్రక్కింటి మేష్టారూపెళ్ళాన్ని అస్తమానమూ తిడుతూనే వుండేవాడు.

అందుకే అమ్మ అంటుంది "ఆడదై పుట్టడం అంటే ఇంతేనమ్మా.....నూటికో, కోటికో ఒక్క ఆడది సుఖపడుతుంది. వాళ్ళకేం మగ మహా రాజులు" అని. నిజమే...అయినా, అమ్మ నాన్నని ఏమీ అనదు.

అట్లా అంటే పాపం.... తను సావిత్రికథ సీతకథ, అనసూయకథ, అన్నీ విన్నది. తొమ్మిది గంటల ప్రాంతంలో, మురళీకృష్ణ ఎక్కడికో వెళ్ళిపోతూవుంటే చాటుగా చూసింది సీతామహా లక్ష్మి. అతని నడకలోని ఠీవి, గాంభీర్యం చూసి, గర్వంతో సిగ్గుపడింది ఆమె.

* * *

రాత్రిగాని ఇంట్లోకి వచ్చింది వచ్చి చూసేసరికి ఆమెకూర్చున్న సోఫాదగ్గర నిలబడి "వనితా" అని పిలిచాడు మురళీకృష్ణ......

ఏదో పుస్తకంలోని బొమ్మలు చూస్తోంది ఆమె. ముఖంనిండా ఆశ్చర్యం వుంది.... ఆ ముఖంలో అంతకుతప్ప మరేభావమూ లేదప్పుడు.

మళ్ళీ పిలిచాడు "వనితా" అని.....

ఆమె ఉలిక్కిపడి లేచి నిలబడి, అతనివంక భయంగా చూసింది ఆమె. పెదవులు వణికి పోతున్నాయి. ముఖంనిండా ముత్యాలకి మల్లె స్వేదబిందువులు వెలిగాయి. శరీరమంతా శీతా కాలంలోకే మల్లె వణికి పోతోంది. ఒళ్ళు చల్లబడి పోతోంది. కళ్ళ నీళ్ళ చిమ్ముతున్నాయి. వేట గాడిని చూసి బెదిరిపోయిన హరిణంలా అతని సమక్షంలో నిలబడి స్తంభించి పోయింది ఆమె.

మురళీకృష్ణకి కూడా దాదాపు అలాటి భావమే కలిగింది. "ఎందుకిలా వణికి పోతోంది" అను కుని, అతనికి భయం వేసింది.

డాక్టరు గనుక నరాల బలహీనతేమో అను కున్నాడు. నవ్వుతెచ్చిపెట్టుకుని "ఎందు కలా చూస్తావ్ కూర్చో ఫరవాలేదు. అదే తగ్గి పోతుంది. ఇంత ఆరోగ్యమైన శరీరానికి, నీకు నరాల బల హీనత ఏమిటి నాన్సెన్స్" అన్నాడు,భుజం మీద చెయ్యేసి.

ఈసారి మరింత వణికిపోయింది వనిత. ముఖమంతా చెమటలో తడిసిపోయింది. నీర సంగా అతని పాదాల చెంత కూర్చుని, ధైర్యంగా అతని బూట్లు విప్పబోయింది. మురళీకృష్ణ పెద్దగా నవ్వుతూ .... "అదా! నాకు చేతు లున్నాయి. బద్ధకంలేదు అసలు ... నీకెందుకా శ్రమ ... నేను స్నానం చేసి వస్తాను. కాసేపు రెష్టు తీసుకో!" అనేసి వెళ్ళిపోయాడు.

వనితకి కళ్ళు చీకట్లుకమ్మాయి. సోఫాలో కూలబడి, నీరసంగా కళ్ళు మూసుకుంది. మరో పదినిముషాలకి ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షించ సాగాయి .....

"ఆయనకి కోపం వచ్చింది కాబోలు, రాగానే తను లేచి నిలబడలేదని!" అనుకుంది సీతామహా లక్ష్మి.

ఆ పాడుపుస్తకంలో బొమ్మలు చూస్తూ కూచుందిగానీ, లేకపోతే బాగుండేది. తన ఖర్మ అలాంటిది. జరిగిపోయాక చేసేది ఏం వుంది...

సీతామహాలక్ష్మి లేచి తన గదిలోకి వెళ్ళింది. అక్కడ మురళీకృష్ణ, కుర్చీలో కూర్చుని పేపరు ముఖానికి అడ్డం పెట్టుకున్నాడు. "వనితా!" అన్నాడు. ముఖం బయటపెట్టి. "అలా పిలవద్దు నాపేరు సీతామహాలక్ష్మి" అని చెప్పాలనుకుంది. నోరు పెగలలేదు. నిక్షేపం లాంటి సీతమ్మ తల్లిపేరు ...

ఈ వనితేమిటి! గరుత్మంతుడి తల్లి వినత లాగా!

కిటికీ దగ్గర నిలబడింది.

"నన్నుచూస్తే భయమా నీకు!" లాలనగా అడిగాడు. ధైర్యం చెయ్యాలి. లేకపోతే లాభం లేదు.

"మిమ్మల్ని చూస్తే భయం వుండకపోతే, ఇంకెవర్ని చూస్తే వుంటుంది" అంది వణికి పోతూ ....

"ఎందుకు వనితా!"

"అబ్బా! ఆ పాడుపేరు"

" నాపేరు .... నా .... పేరు .... "

"తెలుసు, అది మీ అమ్మమ్మ పేరా?" నవ్వాడు ... "అమ్మమ్మది కాదు. అమ్మమ్మ తల్లిది ఆపేరు .... తరాలనుంచి కలసి వచ్చిన పేరు" అంత ధైర్యం ఎలా వచ్చిందో!

మురళీకృష్ణ నిండుగా నవ్వి, "ఫరవాలేదులే నీకు 'వనిత' అనే పేరే బాగుంటుంది ... నేనలాగే పిలుస్తాను ... ఏం!" అన్నాడు.

ఆమె మళ్ళీ భయంతో,"మీ ఇష్టం" అంది. ముఖంలో భయం తప్ప మరేంలేదు.. కళ్ళు, "భీతిహరిణేక్షణ"ను జ్ఞాపకం చేస్తున్నాయి. దుష్యంతుడినిచూసిన శకుంతల ఇలా బెదిరి వుండ దేమో! కానీ, ప్రవరుడు వరూధినిని ... అనాటి ఆశ్రమాలలోని అందమైన కన్యలా వుంది వనిత.

స్వచ్ఛంగా స్ఫటికంలా వుంది వనిత.

ఎక్కడా ఒక్క మేఘమైనా కనపడని అనంతాంబరంలా వుంది వనిత.

ఆమె కన్నుల నీలినీడలలో ఏదో భయంవున్నా అది కనపడనప్పుడు ఆమె నిర్మలమైన నదీ ప్రవాహంలా వుంటుంది.

తపస్సు చేసిచేసీ సంపాదించిన దివ్యసౌందర్య మూర్తి తన వనిత. పువ్వుల పరిమళం, తేనెల తియ్యదనం, వెన్నెల చల్లదనం, మంచినీటి స్వచ్ఛతా, కలిపి తయారుచేసిన బొమ్మ — వనిత. తన పరిమళాన్ని తను గుర్తించడం లేదీ వనిత. గుర్తింపజేయుటమే తన అభిలాష.

మురళీకృష్ణ ఆమె దగ్గరగా వచ్చి నిల బడుతూ, "ఆనాడు నేను మీవూరు ఏపరి స్థితుల్లో వచ్చానో తెలుసా! ఆవిడకి బాగా సీరి యస్‌గా వుందని కారుతెచ్చి రమ్మని ఒకటేగోల మీవూరి కరణంగారు. .... నేనెప్పుడూ ఇలా డాక్టరు హోదాతో రాలేదా వూరు. .. బయు ల్దేరాను. పొలాలున్నాయి రోడ్డుకి రెండు వైపులా .... బాగుంది దృశ్యం ... చూస్తు న్నాను· నాప్రాణం లేచివచ్చినట్లైంది. ....

ఆవిడ మంచంమీద మూలుగుతోంది. జబ్బు నయంకాదనీ, ఒక్కరోజు కన్నా బ్రతకదనీ నాకు తెలుసు ..తలెత్తి చూశాను ... వనితా!నువ్వా వక్కడ .... తలుపు దగ్గరే నిలబడి, దీనంగా, భయంగా చూస్తున్నావు ...· నిన్నెంతసేపు చూశానో తెలీదు . · తరవాత .... '

తరవాత ఏమైందో వనితకు తెలుసు ... నవ్వా లనుకుంది .... ఇంకా భయం పోలేదు. ..

మురళీకృష్ణ మళ్ళీ అన్నాడు. "నిన్ను చేసు కున్నానని ఇక్కడి అమ్మాయిలు నన్ను వెక్కి రించారు! కానీ. నీగురించి వాళ్ళకి తెలీదు ... "

స్నేహితుడికి మల్లే, చల్లగా, మెత్తగా మాట్లాడుతున్నాడతను.

''నేను వెళ్లాలి వనితా! మళ్లీ సాయంత్రం వస్తాను.. డిస్పెన్సరీకి పోతున్నాను.'' మాటల మధ్యలోనే, హఠాత్తుగా వాచీ చూసి, లేచాడతను. మెట్లు దిగుతూన్న అతనిని నిబ్బరంగా చూసింది సీతామహాలక్ష్మి......

అంతా అయోమయంగా వుంది. ఆడపిల్ల జీవితమే అంత.......

తనకిక్కడ అంతా కొత్తగా వుంది..ఇల్లంతా కాళ్లల్లో సత్తువ తగ్గే వరకు తిరిగి తిరిగి చూసింది. గోడలకి ఉన్న పటాలు నిలబడి నిమిషాల కొద్దీ చూసింది. అన్నిటి కన్న ఒక బొమ్మతన కెంతో బావుంది. శివతాండవ దృశ్యం అది సాయంత్రం ఆరున్నరకి మురళీకృష్ణ వచ్చాడు.

''సినిమాకి పోదాం వనితా!'' అన్నాడు.

తను వెంటనే ముస్తాబయి బయల్దేరింది.

వెళ్లబోతూవుండగా, నల్లపూసల నెక్లేసుతెచ్చి తెచ్చి ఆమె మెడకి పెట్ట బోయాడతను.

''నేను పెట్టుకుంటానూ....''అంది వనిత.

''లేదు—అరవింద నన్నే అలంకరించ మంది''. అన్నాడతను వెనక వున్న బటన్ నొక్కుతూ. సీతామహాలక్ష్మికిదంతా ఆశ్చర్యంగావుంది. ఏదో అసంతృప్తిగా కూడా వుంది. ఆమె వూహించుకున్న మురళీ కృష్ణవేరు. ఇతను నాన్నలాగా,మామయ్యలాగా, బావలాగా లేడు.......

అతనిలా వుండటం తనకేదో అసంతృప్తిగావుంది.

చిత్రం కదూ!

అమ్మ వెళ్లిపోతూ తనకెన్నో చెప్పి వెళ్లింది. వినయంగా వుండమంది. అతనేలా చెబితే అలా చెయ్యమంది.

ఒకవేళ ఇది అతని చేతగానితనం కాదుగదా!

అప్పుడు మధ్యాహ్నం ఒంటిగంటైంది.

మురళీ కృష్ణ ఇంకా భోజనానికి రాలేదు.సీతామహాలక్ష్మి అతని గదిలోకి వెళ్లి, టేబిల్ మీద మోచేతులు ఆనించి, కుర్చీలో కూర్చుంది. కూర్చుని, తెల్లగా, అందంగా మెరిసి పోతూన్నబుద్ధుడి బొమ్మకేసి చూస్తోంది... పాలరాయేమో అది అతి తెల్ల అందంగా వుంది.

చేతో పట్టుకుని చూసింది.

చెయ్యిజారిపోతోంది పట్టుకుంటే.. తలుపు దగ్గర చప్పుడైంది.

వెనక్కి తిరిగి చూసింది.. మురళీ కృష్ణ!'' సీతామహాలక్ష్మి ఉలిక్కిపడింది.

ఆమె చేతులో ఉన్న పాలరాతిబుద్ధుడు అయిదడుగుల నాలుగంగుళాల ఎత్తునుంచి క్రింద పడి,''నాకెంత గతి పట్టింది'' అని ఆక్రోశించి ముక్కలు ముక్కలై పోయాడు. ఆ ముక్కల్లో చూసి సీతామహాలక్ష్మి వణికిపోయి కళ్లుమూసుకుంది.

మహాప్రళయం రాబోతుందనీ, అందుకు తను సంసిద్ధురాలైనట్లు......... ఏదైనా జరిగినట్లు నిలబడిన సీతామహాలక్ష్మి, స్మృతి తప్పి నేల మీదికి ఒరిగి పోయింది.

విస్మితుడై, ఆమెని లేవదీసి మంచం మీద పడుకోబెట్టి ప్రథమ చికిత్సచేశాడు మురళీ కృష్ణ.

ఆమె హృదయం బలహీనంగా స్పందిస్తోంది.

తనలోని ఏ విషయం ఆమెనిలా భయపెడుతోందో అర్థం కాలేదతనికి!

తను కనపడనప్పుడు ఆమె ముఖం ప్రశాంతంగా వుంటుంది.......

తన సమక్షంలో ఆమె భయంతో వుంటుంది. ఈభయాల గోడల వెనక ఏదో చరిత్ర వుండాలి. అది తెలుసుకుని ఆమెని సముదాయించిన తరువాతగానీ, తను సుఖపడడు. ఆమె కూడా సుఖపడదు.

ఆమె తన ఎడల కనబరుస్తున్న భక్తి, భయం తనని బాధపెడుతున్నాయి.. అవి తను భరించ లేడు.

వీటన్నిటికన్నా ఉదాత్తమైన స్నేహభావం కావాలి తనకి. తన వనిత నుంచి.

ఆమెకి స్మృతి వచ్చేవరకూ ప్రక్కనే కూర్చుని తల నిమురుతూ.

''వనిత ఎందుకంత భయం. బొమ్మ చెయ్యి జారింది. అందుకు భయం దేనికి నేను పగల గొడితే కూడా అంతేగా ఫలితం'' అన్నాడు లాలనగా.

వనిత కళ్లనిండా నీరు నింపుకుని, దీనంగా చూసింది. ఆచూపులోని దైన్యం అతను భరించ లేడు. తన హృదయాన్ని కత్తివలె చీల్చి వేస్తుంది ఆ దీనత.

అతనిలా తనని లాలించే కన్న నాన్నమాదిరిగా మామయ్య మాదిరిగా, బావ మాదిరిగా తనని కసికొద్దీ తిట్టి వుంటే బాగుండేదనుకుంది సీతామహాలక్ష్మి.

ఆమెకళ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

''పిచ్చి వనితా ఇంత అమాయికురాలివి! ఎలా బ్రతుకుతావు ఈ లోకంలో! నేను నీకు స్నేహితుడిని అనుకో వనితా! మనిద్దరం ఒకరి కొకరం ఆప్తులం.... మనస్సువిప్పి మర్మం లేకుండా మాట్లాడు కోవాలి... నిజం చెప్పు వనితా.. ఎందుకు నేనంటే నీకు భయం'' అతని చెయ్యి వెచ్చగా కాలిపోతున్నా ఆమె నుదుటిమీద చల్లగా వుంది.

అమృతపాసంలా వుంది ఆస్పర్శ... ''జ్వరం వచ్చింది నీకు'' అన్నాడతను. ''మందుకోసం వెళ్లివస్తాను'' అని లేవబోయాడు.

''వద్దు'' అంది వనిత బలహీనంగా....

అతను అరచేయి ఆమె నుదుటి మీదే వుంది.

''చెప్పు ఇంత భయం ఎందుకో నీబాధలూ, నీ అభిప్రాయాలూ నీస్నేహితులకి చెప్పవా'' అన్నాడు మురళీకృష్ణ, ఆమెతల ఎత్తి తన తొడమీద పెట్టుకుని.

ఒక మహావృక్షపు నీడలా తలదాచుకున్న అలసి అలసి వున్న బాటసారిలాగ తనని పోల్చుకుంది సీతామహాలక్ష్మి......

ఆమె చెప్పింది.... భావావేశంలో ముఖం అంతా కందిపోగా తన హృదయాన్ని విప్పి అతని ముందు వుంచింది.

తాను పుట్టి పెరిగిన వూరు తప్ప ఇంకేమీ ఎరగదు. లోకం ఎలాంటిదో ఎరగదు.తానుపుట్టి బుద్ధి తెలిసినప్పటినుంచీ ఆడవాళ్లు ఎన్నెన్ని బాధలు పడతారో మాత్రమే తెలుసుకుంటూ వచ్చింది. తమ కుటుంబాల్లో ప్రతి పురుషుడు ఆడవాళ్లని ''నువ్వు స్త్రీవి'' అని ఏదో అల సత్వాన్ని ప్రకటిస్తూ వుంటారు. వీలు చిక్కినప్పుడల్లా అమ్మ ''ఆడ బ్రతుకింతే'' అని విలపించడం చాలాసార్లు చూసింది తను. నాన్న అమ్మని దారుణంగా హింసించేవాడు. మామయ్య అత్తయ్యనీ అంతే.

అందుచేత తనకి భర్త అంటే ఒక అభిప్రాయం మనస్సులో స్థిరపడి పోయింది. పెళ్లి రోజున తన జీవితంలో విషాదపు ఘడియలు ప్రవేశించినట్లే అనుకుంది తను. భర్తని ఓ రాక్షసుడిమాదిరి చూడటం ఆమెకి అలవాటు అయి పోయింది. ఇదంతా చెబుతూ చెబుతూ వనిత ఏడుస్తూనే వుంది. వెక్కి వెక్కి ఏడ్చి అతని తొడమీద అలసిపోయి కళ్లు మూసుకుంది వనిత.

''పిచ్చి వనితా నువ్వు భయపడనక్కర్లేదు. నిన్ను నువ్వు గర్వించుకో నీవ్యక్తిత్వం నిలబెట్టుకో ఇది మీవూరుకాదు. ఇక్కడ మీనాన్న మామయ్య లేరు..''. నేను ఉన్నాను.... సేవా, భక్తి, భయం నాకు వద్దు. నీస్నేహం, నీ అనురాగం నాకురావాలి. నీసౌందర్యం నాకు కావాలి...'' అన్నాడు మురళీ కృష్ణ ఆవేశంగా.

వనిత అతని ముఖం కేసి ఆశగా చూసింది.

